సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 23 । జనవరి । 2024



ఆర్ఎస్ఐలకు స్థాన చలనం

కర్నూలు, అనంతపురం రేంజ్‌లో పనిచేస్తున్న 43 మంది ఆర్ఎస్ఐలకు స్థాన చలనం కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

10లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.8°/16.7°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

సాఫీగా సర్టిఫికెట్ల పరిశీలన



జేడీలు సుబ్రహ్మణ్యం, శుభదాస్ సమక్షంలో ఏహెచ్ఏ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్ఏ) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా సోమవారం అర్హత పొందిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. అనంతపురం పశు సంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో రెండు జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ శుభదాస్ సమక్షంలో డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ సత్యరాజ్, డాక్టర్ టి.సుధాకర్ తదితరుల నేతృత్వంలో పలువురు ఏడీలు, పశువైద్యులు, క్లరికల్ స్టాఫ్ నాలుగు బృందాలుగా ఏర్పడి సర్టిఫికెట్లు నిశితంగా పరిశీలన చేశారు. రెండు జిల్లాల పరిధిలో 473 పోస్టులకు 919 మంది అభ్యర్థులు గత నెల 31 ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యారు. డైరెక్టరేట్ పరిధిలోనే మెరిట్, రోస్టర్, కటాఫ్ మార్కుల ఆధారంగా తొలి విడతగా 206 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం 105 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన సాఫీగా జరిగినట్లు జేడీలు తెలిపారు. మంగళవారం మిగతా 101 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న వీఏహెచ్ఏలో బదిలీల తర్వాత ఖాళీలను బట్టి కొత్త అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

30 నుంచి ఉచిత శిక్షణ

పెనుకొండ: డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సులో ఈ నెల 30 నుంచి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో మూడు నెలల పాటు కొనసాగే శిక్షణకు పది, ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన వారు అర్హులు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు స్కిల్ హబ్ సెంటర్ కో-ఆర్డినేటర్ శివప్రసాద్ (96767 06976)ను సంప్రదించవచ్చు.





ఉరవకొండలో బహిరంగ సభకు పూర్తయిన ఏర్పాట్లు

నేడు సీఎం జగన్ రాక

- ఉరవకొండ నుంచి వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం

ఉరవకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధం చేశారు. మంగళవారం ఉరవకొండలోని అనంతపురం బైపాస్ సమీపంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద డ్వాక్రా సంఘాలకు నిధులు విడుదల చేసే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 7,97,850 సంఘాల్లోని 78,90,154 మంది అక్కచెల్లెమ్మలకు రూ.6,384 కోట్లు చెల్లించనున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 2,41,000 మంది లబ్ధిదారులకు రూ.183.59 కోట్ల మేర సొమ్ము జమ కానుంది. ఈ సందర్భంగా సభనుద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. పర్యటన ఏర్పాట్లను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, ప్రోగ్రామ్ అబ్జర్వర్ ఎంఆర్‌సీ రెడ్డి, ఎమ్మెల్యే శంకరనారాయణ, ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ అన్బురాజన్, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న తదితరులు పరిశీలించారు. దూరప్రాంతాల నుండి వచ్చే వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు కేటాయించారు. వచ్చే వారికి ఆహారం, తాగునీరు సమకూరుస్తున్నారు.

హెలిప్యాడ్ ట్రయల్ రన్ విజయవంతం

ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం హెలిప్యాడ్ ట్రయల్ రన్ నిర్వహించారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

తరలిరానున్న మహిళా లోకం

'వైఎస్సార్ ఆసరా' సభకు జిల్లా నలు మూలల నుంచి మహిళా లోకం తరలిరానుంది. దశల వారీగా డ్వాక్రా సంఘాలకు సొమ్ము విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అక్కచెల్లెమ్మలు ఘనంగా స్వాగతం పలకనున్నారు. సభను జయప్రదం చేయాలని ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ పిలుపునిచ్చారు.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉరవకొండ పర్యటన నేపథ్యంలో సత్యసాయి విమానాశ్రయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పుట్టపర్తిలోని సాయిఆరామంలో పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. బందోబస్తుపై సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం అడిషనల్ ఎస్పీ విష్ణు, ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ నవీన్‌కుమార్ తదితరులతో కలిసి సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పొరపాట్లకు తావివ్వకుండా సమన్వయంతో పని చేయాలన్నారు.

500 మందితో బందోబస్తు..

సీఎం పర్యటన బందోబస్తు విధుల్లో 500 మంది పాల్గొంటున్నట్లు ఎస్పీ తెలిపారు. ఏఎస్పీతో పాటు నలుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 31 మంది ఎస్ఐలు, 94 మంది హెడ్ కానిస్టేబుల్, 150 మంది కానిస్టేబుళ్లు, 12 మంది మహిళా కానిస్టేబుళ్లు, 40 మంది హోంగార్డులకు విధులు కేటాయించామన్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్

అనంతపురం అర్బన్: ఉరవకొండలో నిర్వహించే వైఎస్సార్ ఆసరా రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విచ్చేస్తున్నారు.

- ఉదయం 9 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి సీఎం జగన్ విమానంలో బయల్దేరి 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు.
- 10 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.30 గంటలకు ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడే 10 నిమిషాల పాటు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు.
- ఉదయం 10.40 గంటలకు అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో బయల్దేరి 10.50 గంటలకు అనంతపురం బైపాస్ సమీపంలోని బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకుంటారు.
- ఉదయం 10.55 గంటలకు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి సీఎం పూలమాల వేసి నివాళులర్పిస్తారు. స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలతో మాట్లాడతారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఆ తరువాత వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద కంప్యూటర్ బటన్ నొక్కి డ్వాక్రా సంఘాల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తారు. అటు తరువాత మెగా చెక్ విడుదల చేస్తారు.
- మధ్యాహ్నం 12.35 గంటలకు బహిరంగ సభ వద్ద నుంచి బయల్దేరి 12.45 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 1.45 గంటల వరకు స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- 1.50 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 2.20 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. 2.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి విమాన మార్గాన గన్నవరం వెళతారు.





సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఆలూరి సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ తదితరులు



పుట్టపర్తి విమానాశ్రయం వద్ద బందోబస్తుపై అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం





మహమ్మదాబాద్ క్రాస్‌లో నిర్వహించిన సభకు పెద్ద ఎత్తున హాజరైన ప్రజానీకం, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

- బాబు వస్తే మళ్లీ కరువు వస్తుంది
- టీడీపీ హయాంలో ధనార్జనే ధ్యేయంగా పని చేసిన తెలుగు తమ్ముళ్లు
- మోసకారి 'పల్లె' మాటలు వింటే నిండా ముంచేస్తాడు
- ఓటు వేసే ముందు ఆలోచించండి.. అభివృద్ధికి పట్టం కట్టండి
- నాలుగో రోజు 'రైతు విజయ సంకల్ప యాత్ర'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- గ్రామ గ్రామానా ఘన స్వాగతం

అమడగూరు: పాలకుడు మంచివాడైతే ప్రకృతీ కరుణిస్తుందని, అందువల్లే నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలని, ఆయనొస్తే మళ్లీ కరువు వస్తుందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే పనులకు శ్రీకారం చుడుతూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేపట్టిన 'డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప యాత్ర' నాలుగోరోజు సోమవారం అమడగూరు, ఓడీచెరువు మండలాల్లో కొనసాగింది. ఉదయం అమడగూరు మండలంలో ప్రారంభమైన పాదయాత్ర గాజులపల్లి, దిన్నెమీదపల్లి క్రాస్, పేరంవాండ్లపల్లి క్వార్టర్స్, కొలిమిరాళ్లపల్లి క్రాస్, కొత్తూరు, చెర్లోపల్లి, కస్సముద్రం, మహమ్మదాబాద్ మీదుగా సాగి ఓడిచెరువు మండలంలోకి ప్రవేశించింది. అనంతరం మహమ్మదాబాద్ క్రాస్, సున్నంపల్లి క్రాస్, రామయ్యపేట, చౌడేపల్లి క్రాస్, దాదిరెడ్డిపల్లి క్రాస్, గౌరాపురం, బాలప్పగారిపల్లి గ్రామాల వరకూ సాగింది. నాలుగోరోజు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మొత్తం 18 గ్రామాల మీదుగా 19 కి.మీ. మేర పాదయాత్ర చేశారు. ప్రతి గ్రామంలోనూ మహిళలు హారతులు పట్టి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొన్నారు.

'పల్లె'ను నమ్మకండి

రాజకీయాల్లో విలువలు ముఖ్యమని, ఓటు కోసం మాయమాటలు చెప్పే 'పల్లె' లాంటి వలసవాదులను నమ్మవద్దని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహమ్మదాబాద్ క్రాస్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేతల మోసాలపై విరుచుకుపడ్డారు. మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి.. తన స్వార్థం కోసం జనాన్ని నిండా ముంచాడన్నారు. ఆయన బాటలోనే నడిచిన తెలుగు తమ్ముళ్లు 'నీరు-చెట్టు' పేరుతో కోట్లాది రూపాయలను దోచుకున్నారని విమర్శించారు. చంద్రబాబు సీఎంగా ఉన్న 14 ఏళ్ల రాష్ట్రమంతా తీవ్ర కరువు ఛాయలు అలుముకున్నాయనే విషయాన్ని గుర్తు చేశారు. 'అక్కకు పసుపు.. చెల్లెమ్మకు కుంకుమ' పెడతామని మహిళలకు పంగనామాలు పెట్టారని మండిపడ్డారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల వేళ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. అందుకే జనమంతా జగన్ వెంట నడుస్తున్నారన్నారు.

గ్రామ స్వరాజ్యంతో ఇంటికే పథకాలు..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న తీసుకువచ్చారన్నారు. గ్రామ సచివాలయాలు,



దుద్దుకుంట అపర్ణారెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రలో పాల్గొన్న మహిళలు

వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలన్నీ నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరవేస్తున్నారన్నారు. గతంలో ఏ పథకం అందాలన్నా జన్మభూమి కమిటీలకు లంచం ఇవ్వాల్సి వచ్చేదని, నేడు లంచం అనే మాటే లేకుండా చేశారన్నారు. ప్రస్తుతం సమాజంలోని అన్ని వర్గాల వారికి మంచి జరిగే విధంగా పథకాలు అమలవుతున్నాయన్నారు. ఈసారి అధికారంలోకి రాగానే మరిన్ని సంక్షేమ పథకాలను అమల్లోకి తెస్తామన్నారు.

193 చెరువులను నింపి తీరుతా

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 193 చెరువులకు కచ్చితంగా కృష్ణా జలాలను నింపి తీరుతామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే చెరువులను నింపడం కోసం 3 టీఎంసీల నీళ్లు, రూ.864 కోట్ల నిధులు కేటాయిస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మన ప్రాంతం సుభిక్షంగా ఉండాలంటే మరోసారి వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. పాదయాత్రలో అమడగూరు ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవిత, ఎమ్మెల్యే సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, అమడగూరు కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శేషూరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, రాష్ట్ర భట్రాజుల సంఘం డైరెక్టర్ మధు సూదన్‌రాజు, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి భారతి, సొసైటీ అధ్యక్షుడు బొట్టుస్వామి, సర్పంచులు లక్ష్మీ నరసమ్మ, ఆదినారాయణ, షబ్బీర్, శ్రీధర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, టౌన్ కన్వీనర్ సుధాకర్‌రాజు పాల్గొన్నారు. ఓడిచెరువు మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, కన్వీనర్ రాజు నాయుడు, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షామీర్ బాషా, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం డైరెక్టర్ వెంకటేష్ ప్రసాద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 13,91,628

- మహిళా ఓటర్లే అధికం
- తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్ అరుణ్‌బాబు

6,97,119
మహిళా ఓటర్లు

6,94,446
పురుష ఓటర్లు

63
ఇతరులు

1,561
జిల్లాలో పోలింగ్ కేంద్రాలు



నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మడకశిర(ఎస్సీ)	1,06,242	1,04,831	01	2,11,074
హిందూపురం	1,23,974	1,22,471	18	2,46,463
పెనుకొండ	1,17,310	1,16,369	03	2,33,682
పుట్టపర్తి	1,04,092	1,05,970	14	2,10,076
ధర్మవరం	1,19,086	1,20,451	20	2,39,557
కదిరి	1,23,742	1,27,027	07	2,50,776
మొత్తం	6,94,446	6,97,119	63	13,91,628

పుట్టపర్తి అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ తర్వాత సోమవారం జిల్లా ఓటరు తుది జాబితా విడుదలైంది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ అరుణ్‌బాబు ఓటరు తుది జాబితాను విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 13,91,628 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో పురుషులు 6,94,446 మంది, మహిళా ఓటర్లు 6,97,119 మంది, ఇతరులు 63 ఓటర్లుగా ఉన్నారన్నారు. జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఇందులో గ్రామ స్థాయిలో 1,194, పట్టణ స్థాయిలో 367 ఉన్నట్లు వెల్లడించారు. వివిధ వర్గాల నుంచి అందిన ఫిర్యాదులన్నీ నిబంధనల మేరకు పరిష్కరించి తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేశామన్నారు. మృతుల ఓట్లు తొలగించడం, శాశ్వతంగా వలసలు వెళ్లిన వారిని గుర్తించడం, యువతను ఓటరుగా నమోదు చేయడం, జంక్ ఓటర్లను సరి చేయడం, పది కంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో విచారణ చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఈక్రమంలో బూత్ స్థాయి అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకూ వంద శాతం కృషి చేశారన్నారు. తుది ఓటరు జాబితా అన్ని పోలింగ్ కేంద్రాలు, సహాయ ఓటరు నమోదు అధికారులు, ఓటరు నమోదు అధికారులు, కలెక్టర్ కార్యాలయంలో విచారణ నిమిత్తం అందుబాటులో ఉంటాయన్నారు.

అభ్యంతరాలన్నీ పరిష్కరించాం..

ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా ఫారం-8 కింద 61,237 దరఖాస్తులు, ఫారం-7 కింద 53,404 దరఖాస్తులు, ఫారం-6 కింద 91,647 దరఖాస్తులు అందగా, వాటన్నింటినీ విచారణ పూర్తి చేశామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. అలాగే నవంబర్ 4, 5 తేదీల్లో, డిసెంబర్ 2, 3 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటరు జాబితా వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నామినేషన్ వరకు దరఖాస్తు..

కొత్తగా ఓటరుగా నమోదుకు రానున్న ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే రోజు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఓటు తొలగింపునకు, ఓటరు వివరాల మార్పులు, చేర్పులకు సంబంధించి కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించి వీరికి రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేందుకు అనుబంధ జాబితా రూపొందిస్తామన్నారు. సమావేశంలో డీఆర్ఓ కొండయ్య, వివిధ గుర్తింపు పొందిన పార్టీల నాయకులు ఉన్నారు.

2,673 మంది మహిళలు అధికం..

జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 2,673 మంది అధికంగా ఉన్నారు. ఓటరు జాబితా పరిశీలిస్తే కొన్ని నియోజకవర్గాల్లో మహిళలు అధిక సంఖ్యలో ఉండగా, మరికొన్ని నియోజకవర్గాల్లో పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. మహిళా ఓటర్లకు సంబంధించి పుట్టపర్తి నియోజక వర్గంలో 1,878 మంది, ధర్మవరం నియోజకవర్గంలో 1,365 మంది, కదిరి నియోజక వర్గంలో 3,285 మంది అధికంగా ఉన్నారు. ఇక మడకశిర నియోజక వర్గంలో 1,411 మంది, హిందూపురం నియోజక వర్గంలో 1,503 మంది, పెనుకొండ నియోజక వర్గంలో 941 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.

ప్రతి అర్జీకి సంతృప్తికర పరిష్కారం

• స్పందనకు 130 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: సమస్యలపై ప్రజలు అందజేస్తున్న ప్రతి అర్జీకి సంతృప్తికర పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై 130 వినతలను ఆయన స్వీకరించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. గడువులోపు అర్జీలను పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పర్యటించి పోలింగ్ కేంద్రాల స్థితిగతులను పరిశీలించి, ఈ నెల 31వ తేదీ నాటికి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్ సౌకర్యం, మరుగుదొడ్డి, విద్యుత్, తాగు నీటి సరఫరా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సచివాలయాల నోడలాఫీసర్ శివారెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాలరెడ్డి, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రాం, నిర్మలాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష..

ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్షించారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానాన్ని పరిశీలించి ప్రణాళిక రూపొందించుకుని పనులు చేపడతామని అధికారులు వివరించారు. ప్రభుత్వ శాఖల శకటాలు, స్టాల్స్ ఏర్పాటుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, స్వాంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులు, ఇతర ముఖ్య అతిథులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్య పరచండి

రోడ్డు భద్రతపై ప్రజలను మరింత చైతన్య పరచాలని, దీని కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అరుణబాబు ఆదేశించారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19 వరకూ జరిగే రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రవాణాశాఖ అధికారులతో కలసి ఆయన పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఓ కరుణసాగర్‌రెడ్డి, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ సంజీవయ్య, పంచాయతీరాజ్ ఎస్‌ఈ గోపాలరెడ్డి, మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు డీఎస్‌ఎం వరప్రసాద్, శివశంకర్, ఉదయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్కేయూకు ఐసెట్ నిర్వహణ బాధ్యత

అనంతపురం: ఏపీ ఐసెట్ (ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)–2024 నిర్వహణ బాధ్యతను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి అప్పగించారు. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి. గతేడాది ఏపీ ఐసెట్‌ను ఎస్కేయూ సమర్థవంతంగా నిర్వహించిన నేపథ్యంలో తాజాగా రెండో దఫా నిర్వహణా బాధ్యతలు అప్పగించడం గమనార్హం. ఈ క్రమంలో ఏపీ ఐసెట్ చైర్మన్‌గా ఎస్కేయూ వీసీ కె.హుస్సేన్ రెడ్డి నియమితులయ్యారు. కన్వీనర్‌గా ఎస్కేయూ ఎంబీఏ, కంప్యూటర్ సైన్సెస్, కామర్స్ విభాగాల్లో నుంచి ఓ ప్రొఫెసర్‌ను ఎంపిక చేయనున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు



పుట్టపర్తి టౌన్: అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 24న పుట్టపర్తి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు. ఈ మేరకు డిపో మేనేజర్ ఇనాయతుల్లా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అరుణాచలంతో పాటు వేలూరు గోల్డన్‌టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి క్షేత్రాలను భక్తులకు చూపించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ప్రత్యేక సర్వీసు పుట్టపర్తి ఆర్టీసీ డిపో నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతుంది. ఆన్‌లైన్ ద్వారా కానీ, పుట్టపర్తి బస్టాండ్‌లోని బుకింగ్ కేంద్రంలో టికెట్ల రిజర్వేషన్ సౌకర్యం ఉంది. పూర్తి వివరాలకు 73828 60486, 94402 01570లో సంప్రదించవచ్చు.

ప్రమాదంలో తల్లీకొడుకు మృతి


పార్థసారథి (ఫైల్) తులసమ్మ (ఫైల్)


ప్రమాదానికి గురైన కారు

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం పట్టణానికి చెందిన పార్థసారథి తన కుటుంబ సభ్యులతో కలసి తమిళనాడులోని కంచికి దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం తెల్లవారుజామున పెనుకొండ సమీపంలోని గోనిపేట వద్ద 44వ జాతీయ రహదారి బ్రిడ్జి వద్దకు రాగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు డీవైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఘటనలో పార్థసారథి(54), ఆయన తల్లి తులసమ్మ(78) అక్కడికక్కడే మృతి చెందారు. పార్థసారథి భార్య మంజుల, కుమార్తె సౌమ్య, కుమారుడు అఖిల్ జస్వంత్ గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై పెనుకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

• ఎస్పీ మాధవరెడ్డి


రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, రవాణాశాఖ అధికారులు

పుట్టపర్తి టౌన్: రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచి జిల్లాను రోడ్డు ప్రమాద రహితంగాతీర్చిదిద్దుదామని ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ భద్రతా వారోత్సవాలకు సంబంధించి రవాణా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను ఆ శాఖ అధికారులతో కలసి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన విడుదల చేసి, మాట్లాడారు. ఈ క్రమంలో వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీఓ కరుణసాగర్‌రెడ్డి, ఎస్‌బీ సీ ఐ రవీంద్రారెడ్డి, శ్రీహర్ష, ఎంవీఐలు శివశంకర్, డీఎస్‌ఎం వరప్రసాద్, ఉదయ్‌కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 16 వినతులు..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 16 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీటీఆర్‌బీ సీఐ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

వివాహిత దుర్మరణం

పెనుకొండ: ఆటోను ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని పావగడకు చెందిన శిరీష (20), తన భర్త హరీష్, ముగ్గురు కుమారులతో కలసి సోమవారం ఉదయం ఆటోలో గోరంట్లకు బయలుదేరారు. పెనుకొండ సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ జంక్షన్‌లోకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన ఐచర్ ఢీకొంది. ఘటనలో శిరీష అక్కడికక్కడే మృతి చెందింది. హరీష్ తీవ్రంగా గాయపడ్డాడు. విగతజీవిగా పడి ఉన్న తల్లి వద్ద కుమారులు రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సయ్యద్ అస్లామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

బిడ్డతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

• 18 నెలల చిన్నారి మృతి

ఎన్పీకుంట: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ చిన్నారితో సహా తల్లి ఆత్మహత్యాయత్నం చేసింది. ఘటనలో చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ఎన్పీకుంట మండలం మల్లెంవారిపల్లికి చెందిన వెంకటనర్సు, ప్రమీల దంపతుల కుమార్తె శ్రావణికి మూడేళ్ల క్రితం చిత్తూరు జిల్లా దేవలంచెరువు గ్రామానికి చెందిన గణేష్‌నాయుడితో వివాహమైంది. దంపతుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో మూడు నెలలుగా పుట్టింట్లోనే శ్రావణి ఉంటోంది. ఆదివారం రాత్రి భార్యాభర్తలు ఫోన్లో వాగ్వాదం చేసుకున్నారు. సహనం కోల్పోయిన శ్రావణి సోమవారం ఉదయం తన 18 నెలల వయసున్న కుమార్తె సాత్వికను తీసుకుని గ్రామ శివారులోని బావిలో దూకింది. గమనించిన పశువుల కాపరులు కేకలు వేయడంతో అటుగా వెళుతున్న ఆటో డ్రైవర్ వెంటనే బావిలో దూకి తల్లీబిడ్డను వెలికి తీశాడు. అప్పటికే సాత్విక మృతి చెందింది. శ్రావణి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రూ.10 లక్షల పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న పోలీసులు

విడపనకల్లు: ఆంధ్ర సరిహద్దులో విడపనకల్లు మండలం హవళిగి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం చేపట్టిన తనిఖీల్లో రూ.10 లక్షల నగదు పట్టుబడింది. వివరాలను సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ, గుంతకల్లు డీఎస్పీ నర్శింగప్ప వెల్లడించారు. సోమవారం ఉదయం కర్ణాటక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని హవళిగి చెక్‌పోస్టు వద్ద చెక్‌పోస్టు సిబ్బంది, పాల్తూరు పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి దాఖలాలు లేకుండా తరలిస్తున్న రూ.10 లక్షలు బయటపడింది. నగదు తరలిస్తున్న కర్ణాటకకు చెందిన చాకలి వీరభద్రప్పను అదుపులోకి తీసుకున్నారు. నగదుతో పాటు వాహనాన్నీ సీజ్ చేశారు. తనిఖీల్లో పాల్తూరు ఎస్‌ఐ తిప్పయ్య, ఎక్సైజ్ ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాక్‌లో మెరుగైన గ్రేడింగ్ సాధనే లక్ష్యం


మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ డాక్టర్ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం: న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్)లో మెరుగైన గ్రేడింగ్ సాధనే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని సంబంధిత అధికారులకు ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి సూచించారు. న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్లడానికి కాల పరిమితి దాటిన నేపథ్యంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాక్ గ్రేడింగ్‌కు సంబంధించిన అంశాలపై వర్సిటీ పాలక భవనంలో డీన్‌లు, బోర్డ్‌ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, విభాగాధిపతులతో సోమవారం ఆయన సమీక్షించారు. న్యాక్ గ్రేడింగ్‌కు సంబంధించిన అంశాల పర్యవేక్షణకు ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారని విభాగాధిపతులు పేర్కొనగా, వెంటనే వారిని తప్పించి వర్సిటీ ఉన్నతాధికారులే బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నా.. వర్సిటీ వెబ్‌సైట్‌లో తాజా సమాచారం పొందుపరచకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పీజీ అడ్మిషన్ల పెంపుదలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలన్నారు. అలాగే పీజీ తరగతులు నిర్వహించని ప్రొఫెసర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధుల మెరుగుకు కృషి

• మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి


మెప్మా అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న మెప్మా ఎండీ విజయలక్ష్మి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా మహిళల జీవనోపాధుల మెరుగుకు కృషి చేయాలని మెప్మా అధికారులు, సిబ్బందిని మెప్మా మిషన్ డైరెక్టర్ (ఎండీ) విజయలక్ష్మి ఆదేశించారు. సోమవారం ఏడీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా మెప్మా అధికారులు, సీఓలు, ఆర్‌పీలతో ఆమె సమావేశమై మాట్లాడారు. తొలుత వైఎస్సార్ ఆసరాపై సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో 11,773 సంఘాలకు నాలుగు విడతల్లో రూ.354.27 కోట్లు జమ అవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగో విడతకు సంబంధించి అనంతపురం జిల్లాలోని 7,137 సంఘాల సభ్యులకు రూ.53.16 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలోని 4,726 సంఘాలకు రూ.35.34 కోట్లు జమ అవుతున్నట్లు తెలిపారు. మహిళలు మరింత ఆర్థిక ప్రగతి సాధించేందుకు ఈ–మార్ట్‌లు, పట్టణ ప్రగతి యూనిట్లు, జగనన్న అర్బన్ మార్కెట్లు, జగనన్న మహిళా మార్ట్‌లు, ఆహా క్యాంటీన్ల ఏర్పాటుపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు.

ఆర్‌ఎస్‌ఐలకు స్థాన చలనం

అనంతపురం క్రైం: కర్నూలు, అనంతపురం రేంజ్ పరిధిలోని 49 మంది ఆర్‌ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి 19 మంది ఉన్నారు.

ఉమ్మడి జిల్లాకు సంబంధించి బదిలీ వివరాలు ఇలా..

పేరు	ప్రస్తుత జిల్లా	బదిలీ జిల్లా
బి.స్వామి నాయక్	వైఎస్సార్ జిల్లా	అనంతపురం
ఎస్.జాఫర్	అన్నమయ్య	అనంతపురం
కె.ప్రవీణ్‌కుమార్	అనంతపురం	చిత్తూరు
ఎం.బాలాజీనాయక్	అనంతపురం	చిత్తూరు
ఎస్.మక్బూల్	అనంతపురం	చిత్తూరు
ఎం.రమేష్‌నాయక్	అనంతపురం	చిత్తూరు
కె.ముస్తఫా	అనంతపురం	చిత్తూరు
బి.హెచ్.బి.ప్రదీప్‌సింగ్	శ్రీసత్యసాయి	తిరుపతి
బత్తిని రాజు	శ్రీసత్యసాయి	తిరుపతి
కోదూరు వెంకటేశ్వరరావు	శ్రీసత్యసాయి	అన్నమయ్య
జె.లక్ష్మణ	శ్రీసత్యసాయి	తిరుపతి
పి.ప్రసాద్	శ్రీసత్యసాయి	తిరుపతి
జి.గోపాల్	చిత్తూరు	అనంతపురం
జి.ఫజులుద్దీన్	చిత్తూరు	అనంతపురం
షేక్ ఇమామ్ ఖాసీం	తిరుపతి	శ్రీసత్యసాయి
బి.మల్లిక	తిరుపతి	శ్రీసత్యసాయి
పి.త్యాగరాజు నాయుడు	తిరుపతి	శ్రీసత్యసాయి
కె.లక్ష్మీపతి	తిరుపతి	శ్రీసత్యసాయి
టి.వి.రామకృష్ణ	తిరుపతి	శ్రీసత్యసాయి

'దిగుబడి పెంచే విత్తన రకాలు అభివృద్ధి చేయాలి'

కదిరి అర్బన్: వేరుశనగలో చీడపీడలు, బెట్టను తట్టుకుని దిగుబడి పెంచే విత్తన రకాలను అభివృద్ధి చేయాలని శాస్త్రవేత్తలకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రాష్ట్ర పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని విస్తరణ సంచాలకులు సుబ్బరామిరెడ్డితో కలసి ఆమె సందర్శించి, మాట్లాడారు. ఆకుమచ్చ తెగులు, కాండముక్కు తెగులు సమర్థవంతంగా తట్టుకునే విత్తన రకాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన వేరుశనగ వంగడాలు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు అందుతున్నాయన్నారు. ఈ క్రమంలో ఉత్తమ వ్యవసాయ పరిశోధనా స్థానం అవార్డు దక్కించుకున్న శాస్త్రవేత్తలను అభినందించారు. కార్యక్రమంలో పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ ప్రసన్నరాజేష్, డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ

ధర్మవరం అర్బన్: ఈ నెల 24 నుంచి ధర్మవరం వేదికగా జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్మీయ ట్రస్ట్ సౌజన్యంతో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగం జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ ఈ నెల 26వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగే ఈ టోర్నీలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బాలబాలికల జట్లు పాల్గొనవచ్చు. పూర్తి వివరాలకు 90309 44717, 93917 19932లో సంప్రదించవచ్చు.

మహిళను ఏమార్చి నగదు డ్రా

గాండ్లపెంట: ఏటీఎంలో నగదు డ్రా చేసుకునేందుకు వచ్చిన మహిళను ఏమార్చి ఆమెకు తెలియకుండానే ఖాతాలో నుంచి నగదు డ్రా చేసుకున్న వైనం గాండ్లపెంట మండలం కల్లూరు ఎస్‌బీఐ శాఖ వద్ద చోటు చేసుకుంది. వివరాలు... కల్లూరుకు చెందిన నూర్జహాన్ రూ.10వేలు విత్ డ్రా చేసేందుకు సోమవారం ఉదయం స్థానిక ఎస్‌బీఐ శాఖ వద్ద ఉన్న ఏటీఎం వద్దకెళ్లింది. నగదు డ్రా చేసే విధానం ఆమె తెలియక పోవడంతో అక్కడే ఉన్న యువకుడి సాయం కోరింది. ఆ సమయంలో ఆమె దృష్టిని ఏమార్చి మరో కార్డును ఏటీఎంలో పెట్టి పిన్ నంబర్ కొట్టాలని చెప్పాడు. ఆమె పిన్ నంబర్ కొట్టిన తర్వాత నగదు బయటకు రాకపోవడంతో ఏటీఎం సక్రమంగా పనిచేయడం లేదని బుకాయించి బయటకు వచ్చేశాడు. దీంతో యువకుడు ఇచ్చిన ఏటీఎం కార్డును తనదిగా భావించి తీసుకున్న ఆమె అక్కడి నుంచి కెనరా బ్యాంక్ ఏటీఎం వద్దకెళుతూ తన వద్ద ఉన్న కార్డును పరిశీలించడంతో అది తనది కాదని గుర్తించి వెంటనే వెనుదిరిగి ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు చేరుకుంది. అప్పటికే యువకుడు వెళ్లిపోయాడు. అతని గురించి ఆరా తీస్తుండగానే ఆమె మొబైల్‌కు రూ.10 వేలు విత్‌డ్రా అయినట్లుగా సమాచారం అందింది. వెంటనే బ్యాంకులోకి వెళ్లి అధికారులను సంప్రదించి, వారి సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

నిర్మాణ రంగంలో యువతకు ఉచిత శిక్షణ

హిందూపురం టౌన్: నిర్మాణ రంగంలో యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎలక్ట్రీషియన్ విభాగంలో 18 నుంచి 34 ఏళ్ల లోపు వయస్సు, 10వ తరగతి పాస్/ఫెయిల్ అయిన యువతీ యువకులు అర్హులు. ల్యాండ్ సర్వేయింగ్ విభాగంలో ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులు. ముక్కడిపేటలోని పాత ఎస్సీ బాలుర హాస్టల్‌లో రోజుకు 4 గంటల చొప్పున 70 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. అనంతరం సర్టిఫికెట్ అందించి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 90529 01657, 91105 50779లో సంప్రదించవచ్చు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గిడుగు రామ్మూర్తి వర్ధంతి

అనంతపురం: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ఎల్‌ఎం ఉమాదేవి, కార్యదర్శి రమ ఆధ్వర్యంలో వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ఉమాదేవి, కార్యదర్శి రమ పాల్గొన్నారు. ఎల్‌ఎం ఉమాదేవి మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి రచనలకు ప్రత్యేకత ఉంటుందన్నారు. ప్రతి గ్రాంథిక పుస్తకాన్ని తెలుగులో అనువదించారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్ రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి సుబ్బరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే డివిజన్ అభివృద్ధికి కృషి

• నూతన డీఆర్‌ఎం వినీత్‌సింగ్


మనీష్ అగర్వాల్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డీఆర్‌ఎం వినీత్‌సింగ్

గుంతకల్లు: ఉద్యోగులందరినీ కలుపుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని డీఆర్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన వినీత్‌సింగ్ పేర్కొన్నారు. డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌ను సెంట్రల్ రైల్వేలోని నాగపూర్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో భువనేశ్వర్ జోన్‌లోని సంబల్‌పూర్ డీఆర్‌ఎంగా పనిచేస్తున్న వినీత్ సింగ్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం మనీష్ అగర్వాల్ నుంచి గుంతకల్లు డీఆర్‌ఎంగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం డివిజనల్ స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. డివిజన్ స్థితిగతులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఏడీఆర్‌ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.